క్లుప్తంగా

కరాటే పోటీల్లో ప్రతిభ



కరాటే విద్యార్థులతో స్కూలు యాజమాన్యం

పెద్దపంజాణి: ఇటీవల కర్నూలులో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో మండలంలోని మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు 36 మంది ప్రతిభ చాటి పతకాలు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ రవీంద్ర బాబు తెలిపారు. కటా(విన్యాసాలు), కుమితే(ఫైటింగ్) విభాగాల్లో 16 స్వర్ణ, 18 రజత, 20 కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరాటే క్రీడాకారులను, కరాటే మాస్టర్ సదాశివను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపల్ డేవిడ్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

పెద్దపంజాణి: మండలంలోని చిన్నేప ఉర్దూ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మారెళ్ల భాస్కర్ తిరుపతి వే ఫౌండేషన్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇక్బాల్ బాషా, అంజాద్ బాషా, రషీద్ అహ్మద్, బావాజాన్, భవాని, చంద్రశేఖర్, అబ్దుల్ లతీఫ్, శమాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

దాసార్లపల్లెలో తీరిన తాగునీటి సమస్య



బోరుకు కొత్త మోటరు అమర్చడంతో పుష్కలంగా వస్తున్న తాగునీరు

పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డి పంచాయతీ దాసార్లపల్లెలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చొరవతో తాగునీటి సమస్య తీరింది. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోరు మోటరు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో గ్రామస్తులు సమస్యను ఎంపీటీసీ గురు మూర్తి, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డితో కలసి జెడ్పీ చైర్మన్‌కు నివేదించారు. దీనిపై స్పందించిన ఆయన గ్రామానికి కొత్త బోరు మోటరు మంజూరు చేయించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించిన నాయకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ ప్రత్యేక సమావేశం రేపు

సదుం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ప్రత్యేక సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు ఐటీ నోటీసుల జారీ, ×యువగళం×కు స్పందన లేక వారు సృష్టిస్తున్న దాడులపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నియామకం



రెడ్డిశేఖర్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న జనార్దన్

పుంగనూరు: పుంగనూరు మండల రాయల్ ఫ్రంట్ ఆర్‌పీఎఫ్ అధ్యక్షుడిగా మండలంలోని భీమగానిపల్లెకి చెందిన పి.జనార్దన్ రాయల్‌ను నియమించారు. గురువారం ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రెడ్డిశేఖర్ నుంచి జనార్దన్ నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో ఫ్రంట్ నియోజకవర్గ అధ్యక్షుడు హేమంత్ రాయల్, స్థానిక నాయకులు ఆనంద్ రాయల్, అనిల్ రాయల్, పురుషోత్తం, అమరనాథ్, వినాయక, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంపై వివాదం

శాంతిపురం: కనుమలదొడ్డి వద్ద ఓ ఇంటి నిర్మాణంపై గురువారం వివాదం చోటు చేసుకుంది. ప్రభుత్వ భూమి అయిన కాలువ పోరంబోకు స్థలంలో నిర్మాణం చేస్తున్నారని మొరసనపల్లె సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ ఆర్ముగం అడ్డుకున్నారు. మరోవైపు ఇరువర్గాల మోహరింపుతో ఒకింత ఉద్రిక్తత పరిస్థితి తలెత్తింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ నరసింహులు తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. సర్వేయర్ సద్దాం బృందంతో కాలువను సర్వే చేయించి, హద్దులు చూపడంతో వ్యవహారం సద్దుమణిగింది.

కంటి వైద్య శిబిరానికి స్పందన

చిత్తూరు అర్బన్: స్థానిక షర్మన్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్‌ఆర్‌ఐ ప్రియ, ప్రీతి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 32 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి, వాళ్లకు ఉచితంగా చికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చెన్నై ఎంఎన్ కంటి ఆస్పత్రి, చిత్తూరు సహస్ర కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

సీఎం స్థానం..ప్రజల గుండెల్లో పదిలం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ



బైరెడ్డిపల్లెలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానం ప్రజల గుండెల్లో పదిలమని, జగన్ అంటే నమ్మకం అని రాష్ట్ర ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ అన్నారు. బైరెడ్డిపల్లెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం బాటగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. మాట్లాడుతూ, కరోనా సమయంలో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ హైదరాబాద్‌లో విలాసవంతమైన జీవితం గడిపారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని బాబు, కళ్యాణ్ ఇప్పుడొచ్చి ఓటర్లను వంచించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి

గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మండల ప్రజల చిరకాల కల అయిన పీహెచ్‌సీని సీఎం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సాకారం చేశారన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండేలా రూ.1.51 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎమ్మెల్యే సెల్ఫీ చాలెంజ్ చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం వైద్యరంగాన్ని పట్టించుకున్న పాపానపోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం నిర్మించిన పీహెచ్‌సీలో అన్ని సదుపాయాలూ ఉన్నాయని, ఏ అర్ధరాత్రి వేళలో అయినా అత్యవసర వైద్యం అందుతుందని స్పష్టం చేశారు. గతంలో 63 రకాల వ్యాధులకు మాత్రమే మందులు ఉండేవని, మన జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 105 రకాలకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, రాజంపేట వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప, సర్పంచులు, ఎంపీటీసీలు ,వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటేష్, తబ్రాజ్, ఫైజుల్లా, షాకీర్, చంద్రశేఖర్, పీరూసాబ్, జయకుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ వద్ద సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

13న 'జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం'



మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: ఈ నెల 13న మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. గురువారం మండల, గ్రామ స్థాయి అధికారులతో కార్యక్రమ నిర్వహణపై సమావేశం నిర్వహించారు.అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర, ఎంపీడీఓ నాగరాజ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాధవరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, ఏడీఏ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న బోస్ అభిమానులు

పలమనేరు: పట్టణంలోని బాలాజీ కో–ఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్ పుట్టినరోజు సందర్భంగా సిబ్బంది, ఆయన అభిమానులు గురువారం అన్నదానం చేశారు. అలాగే ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లను పంచిపెట్టారు. రిమ్మర్స్ బుద్ధిమాంద్యం పిల్లలకు కేక్ కట్ చేసి పంచారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ శివకుమార్

పుంగనూరు: రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ఎంఆర్‌పీ విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీ శివకుమార్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం పుంగనూరు డివిజన్‌లోని 8 మండలాల డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలు, ఎరువులు మాత్రమే కొనుగోలు చేసి విక్రయించాలన్నారు. పురుగుల మందు నాణ్యమైనది విక్రయించాలని, ధరలను బోర్డులో పెట్టాలని, రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు సరఫరా చేస్తున్నామని, రైతులకు ఆన్‌లైన్, బయోమెట్రిక్ ద్వారా ఎరువులు, విత్తనాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారులు జ్యోతి, సుధాకర్, హేమలత, రబీభా, శ్రీనివాసులు, సుధారాణి, టెక్నికల్ అధికారి ఫయాజ్ పాల్గొన్నారు.

సమస్యల సాధన కోసం పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

పలమనేరు: సమస్యల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని స్థానిక ఏపీ పెన్షనర్ల సంఘ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో సంఘ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 11వ పీఆర్సీలో నష్టపోయామని, కనీసం 12వ పీఆర్సీలోనైనా మంచి ఫలితాల కోసం కృషి చేద్దామన్నారు. అనంతరం జిల్లా కమిటీకి ఎంపికైన రత్నారెడ్డిని సంఘ సభ్యులు అభినందించారు. కొత్త పెన్షన్ రూల్స్, హెల్త్‌కార్డులు ఎలా పొందాలో వివరించారు. సమావేశంలో ధవనముని, వెంకటక్రిష్ణ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డుల నమోదులో నిర్లక్ష్యమొద్దు



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అమరనాథ్

రొంపిచెర్ల: భూ రికార్డుల నమోదులో సిబ్బందికి నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ అమరనాథ్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. సిబ్బంది నిర్లక్ష్యం వలన కూడా అక్కడక్కడా తప్పులు చోటుచేసుకుంటున్నాయని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ విస్తీర్ణంలో తేడాలు ఉంటున్నాయని, రైతులు ఇచ్చిన భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో డీటీలు వెంకటరమణారెడ్డి, లోకేష్, ఆర్ఐ అబ్దుల్ ఖాదర్, 20వీఆర్వోలు పల్లవి, శ్రీనివాసులు, ప్రసాద్, ఎల్లప్ప, మహేష్, ముబారక్ బాషా, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. ఆశీర్వదించండి



వడ్డిపల్లెలో లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఆర్థిక స్థితిగతుల మార్పు కోసమే నవరత్నాలు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీ భరత్

కుప్పం: ''గత పాలకుల్లా కాకుండా కుప్పం నియోజకవర్గంలోని ప్రజలకు అండగా ఉండాలని స్థానికంగా నివసిస్తున్నాం.. అందరికీ అందుబాటులో ఉన్నాం..నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నా.. నన్ను ఆశీర్వదించండి.. మరింతగా అభివృద్ధి పనులతో కుప్పాన్ని అగ్రస్థానంలోకి తీసుకెళ్తా'' అని ఎమ్మెల్సీ భరత్ ప్రజలను కోరారు. గురువారం మున్సిపాలిటీలోని 7, 8 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్లు అందజేసి, ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు తెచ్చేందుకు నవరత్నాల పథకాలు అమలు చేశారని, ఈ పథకాల ఫలాలు అందుకుని ఎందరో జీవన స్థితిగతులను మెరుగు పరచుకున్నారన్నారు. ఇంకనూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందివ్వడానికి వలంటీర్లు, అధికారులు దృష్టి సారించాలన్నారు. ×అందరూ బాగుండాలి–అందులో మనము ఉండాలి× అనే నినాదంలో ప్రజాసేవ చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ దృష్టికి సమస్యలు

7,8 వార్డుల్లోని వడ్డిపల్లె, రాజీవ్‌కాలనీ, పలార్లపల్లె, చీలేపల్లె, పరమసముద్రం గ్రామాల ప్రజలు వివిధ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా మురుగు కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువురు మహిళలు కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



గర్భవతులకు సీమంతం కార్యక్రమంలో ఎమ్మెల్సీ

నాడు–నేడు పాఠశాలను సందర్శన

వడ్డిపల్లెలోని ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్సీ సందర్శించారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ×విద్యాకానుక× సక్రమంగా అందుతోందా, లేదా?, మధ్యాహ్న భోజనం ఎలా ఉంది? అని అడిగి తెలుసుకున్నారు.

గర్భిణులకు సీమంతం

వడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులకు ఎమ్మెల్సీ సీమంతం చేసి, పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆశీర్వదించారు. ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలున్న పక్షంలో తన దృష్టికి తేవాలని అక్కడి టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, స్థానిక కౌన్సిలర్లు నాగరాజు, గణపతి, మోహన్‌రాం , ఎంపీపీలు అశ్విని, వరలక్ష్మి, మండల కన్వీనర్ మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. మండలంలోని దుర్గానగర్ కాలనీలో జెడ్పీ నిధులతో చేస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పనులు పూర్తి చేయాలన్నారు.

సచివాలయం తనిఖీ

పట్టణంలోని గ్రామ సచివాలయం–1 ను జెడ్పీ చైర్మన్ ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులకు మంజూరైన గృహాలను వేగవంతంగా పూర్తి చేయడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



విద్యార్థులకు క్రీడావస్తువులను అందజేస్తున్న శ్యామలాదేవి

ఐరాల: విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామోపాధ్యాయులు కృషి చేయాలని చిత్తూరుకు చెందిన స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్యామలాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్యామలాదేవి వారి కుమారులు రూ.20 వేల విలువ చేసే క్రీడా వస్తువులను గురువారం హెచ్‌ఎం కోమల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. శ్యామలాదేవి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, స్పందన ఫౌండేషన్ సభ్యులు జ్ఞానప్రసాద్, శైలజ, విశ్రాంత ఉపాధ్యాయురాలు గిరిజ పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో 'గోకులాష్టమి'



పుంగనూరు: ప్రత్యేక అలంకారంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ ఉత్సవమూర్తులు



ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో జన సందోహం, (ఇన్‌సెట్) ప్రత్యేక వాహనంలో ఉత్సవ విగ్రహాలు

- ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

పుంగనూరు: గోకులాష్టమి వేడుకలను పట్టణ సమీపంలోని కృష్ణమరెడ్డిపల్లె వద్ద గల శ్రీకృష్ణాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తుల హరేకృష్ణ...హరేకృష్ణ..నమో వాసుదేవాయ నామ స్మరణతో ఆ ప్రాంతం ఆధ్యాత్మికత సంతరించుకుంది. పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సుబ్రమణ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి వందలాది యాదవ కుటుంబాలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. ర్యాలీలో చిన్నారుల శ్రీకృష్ణుని వేషధారణ, పిల్లనగ్రోవి నృత్యాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. అలాగే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అన్నదానం చేశారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

చౌడేపల్లె: మండలంలోని ఎస్.అగ్రహారంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజార్చనలు, అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఇళ్లల్లో కృష్ణుడు, గోపికల ప్రతిమలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో సందడి చేశారు. పాఠశాలల్లో కృష్ణాష్టమి పండుగ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పడుతుందని విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



చౌడేపల్లె: ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి



బైరెడ్డిపల్లెలో కృష్ణుడు, గోపికలకు ప్రత్యేక పూజలు

కన్నమాకులపల్లెలో..



ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మండలంలో కన్నమాకులపల్లెలోని రుక్మిణీ సత్యభామ సమేత గోపాలకృష్ణుని ఆలయంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు, ఆలయ 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ముఖ్య అతిథి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ పూజలకు హాజరై, ఆశీస్సులు అందుకున్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాల వితరణ చేశారు. గ్రామస్తులు, మొరం పంచాయతీ వాసులు, పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పుంగనూరు: విద్యుద్దీపకాంతుల శోభతో వెలుగులీనుతున్న కృష్ణాలయం

ఆదర్శవంతంగా సచివాలయాల సేవలు

- ఉద్యోగులతో కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్, చైర్మన్

పుంగనూరు: సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందించి, ఆదర్శవంతంగా ఉండేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి ఆయన పట్టణంలోని 14, 15 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, నవరత్నాల లబ్ధిదారుల జాబితా, ఆన్‌లైన్ సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులు విధిగా యూనిఫాం ధరించాలన్నారు. కొంత మంది సచివాలయ ఉద్యోగులు అటెండెన్స్ వేసి బయట వెళ్లిపోతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాగే కొన్ని సచివాలయాల్లో సర్టిఫికెట్ల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు తీరు మార్చుకోవాలని, ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు సిబ్బంది లేకపోతే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో పలు కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబశివ తెలిపారు. ఇందుకు 10వ తరగతి ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు అర్హులన్నారు. కోపా మెకానికల్ డీజిల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ మోటర్ వెహికల్, డి మెన్ సివిల్‌కోర్సులు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 22వతేదీ బీఎస్‌ఆర్‌పేటలోని ఐటీఐలో ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.